ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

దవాఖానలో వైద్య సేవలు, ఓపీపై వైద్యులతో సమాచారం తెలుసుకుంటున్న డీఎంహెచ్‌వో రఘునాథ్‌స్వామి.

శామీర్‌పేట, అక్టోబర్ 17: ప్రజలకు మెరుగైన సేవలందించడంలో సిబ్బంది ఎల్లప్పుడు అందుబాటులో ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రఘునాథ్‌స్వామి అన్నారు. మూడుచింతలపల్లి మండల కేంద్రంలోని ప్రాథకమి ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాజరు, ఈపీ, ఓపీ, స్టార్, ఎన్సి, డ్యూ, ఇమ్యూనైజేషన్ రిజిస్టర్‌లు, ఫార్మసీ, ల్యాబ్‌లను పరిశీలించారు. పరిశుభ్రత, ఓపీ సేవలను మెరుగుపరచడానికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మొట్ట మొదటి సారిగా దవాఖానను సందర్శించిన సందర్భంగా డీఎంహెచ్‌వోను వైద్య సిబ్బంది శాలువా, పుష్పగుచ్చంతో సన్మానించారు. కార్యక్రమంలో వైద్యాధికారి దమయంతి, కవిత, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంట్లో చోరీ..నగదు,బంగారు ఆభరణాలు అపహరణ

శామీర్‌పేట,అక్టోబర్ 17: కేశవరం గ్రామంలోని ఓ ఇంట్లో చోరీకి జరిగిన ఘటన శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు కథనం ప్రకారం..మూడుచింతలపల్లి మండలం కేశవరం గ్రామంలో సోమవారం అర్ధరాత్రి ఓ ఇంట్లో కొందరు వ్యక్తులు చోరీకి యత్నించగా గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చెరుకున్న పోలీసులు తమ్మన్న అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి రోల్డ్ గోల్డ్ వాచ్, పట్టీలు, కమ్మలు,మాటీలు, బైక్‌ను స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనలో మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు పోలీసులు భావిస్తున్నారు. కేశవరం గ్రామానికి చెందిన కంచుగంట్ల రమేశ్ ఇంట్లో రూ.10 వేలు, 20 తులాల బంగారం, బంగారు కమ్మలు చోరీకి గురైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

దాతల సహకారంతో కీసరగుట్టలో అభివృద్ధి పనులు

కీసర,అక్టోబర్ 17: దాతల సహకారంతో కీసరగుట్టలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేశామని కీసరగుట్ట ఆలయ చైర్మన్ రమేశ్‌శర్మ తెలిపారు. దమ్మాయిగూడ మున్సిపాలిటీకి చెందిన గిరిస్‌కుమార్ కీసరగుట్ట ఆలయానికి వాటర్ డిస్పెన్సర్, సీసీ కెమెరాలను ఇచ్చారు. వాటిని మంగళవారం కీసరగుట్ట ఆలయ చైర్మన్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు, వేదపండితులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ

దుండిగల్,అక్టోబర్17: నగరంలోని సైనిక్‌పురి గోకుల్‌నగర్‌లో మంగళవారం జరిగిన శ్రీశ్రీశ్రీ నల్లపోచమ్మ అమ్మవారి విగ్రహప్రతిష్టాపణ మహోత్సవంలో ప్రభుత్వ విప్,ఉమ్మడిరంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ,మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు శంభీపూర్‌రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ నందికంటి శ్రీధర్, కొంపల్లి మున్సిపాలిటీ చైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్ దంపతులు తదితరులు పాల్గొన్నారు.

ఎంఎల్ ఆర్ఐటీలో నిఖత్‌కు సత్కారం

హైదరాబాద్, ఆట ప్రతినిధి: ప్రతిష్ఠాత్మక ఆసియాగేమ్స్‌లో కాంస్య పతకం సాధించిన రాష్ట్ర యువ బాక్సర్ నిఖత్ జరీన్‌ను మర్రి లక్ష్మణ్‌రెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఎల్ఆర్ఐటీ) ఘనంగా సన్మానించింది. ప్రస్తుతం ఇక్కడే ఎంబీఏ ద్వితీయ సంవత్సరం చదువుతున్న నిఖత్.. మంగళవారం క్యాంపస్‌లో విద్యార్థులు, అధ్యాపకులు చప్పట్లతో స్వాగతం పలికారు. అనంతరం ఇండోర్ స్టేడియంలో నిఖత్‌ను కాలేజీ చైర్మన్ లక్ష్మణ్‌రెడ్డి, మమతారెడ్డి అభినందించారు.కార్యక్రమంలో ప్రిన్సిపల్ శ్రీనివాస్‌రావు, బ్యాడ్మింటన్ మాజీ చీఫ్ కోచ్ భాస్కర్‌బాబు, ఇతర అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

నిఖత్ జరీనాను సన్మానిస్తున్న ఎంఎల్ఆర్ఐటీ చైర్మన్ లక్ష్మణ్‌రెడ్డి

సంస్కృతి టౌన్‌షిప్‌లో ఆంక్షలు

- విద్యుత్, తాగునీటి సరఫరా నిలిపివేత
- పోలీసులను ఆశ్రయించిన బాధితులు

ఘట్‌కేసర్ రూరల్, అక్టోబర్ 17: లేనిపోని ఆంక్షలు విధించి నిబంధనలు పాటించడం లేదనే సాకుతో జీవించే హక్కును కాలరాస్తున్న సంస్కృతి టౌన్‌షిప్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిపై చర్యలు తీసుకోవాలని పలువురు బాధితులు పోచారం ఐటీ కారిడార్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు.పోచారం ఐటీ కారిడార్ పోలీసులు, బాధితుల కథనం ప్రకారం..పోచారం ఐటీసీ పోలీసు స్టేషన్ పరిధి సంస్కృతి టౌన్‌షిప్‌లో బతుకు దెరువు కోసం కొంత మంది ఇండ్లు కొనుక్కొని చిరువ్యాపారాలు పెట్టుకున్నారు. దాని సాకుతో అసోసియేషన్ అధ్యక్షుడు బి హరిప్రసాద్ పాలకవర్గ సభ్యులు అదనపు పన్నులు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. తమకు వేరే దారి లేదని, బతకడానికే సరిపోని ఆదాయం తో లేక ఇల్లు గడవడమే కష్టంగా ఉందని ప్రాధేయపడినా కనికరించని అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సత్యనారాయణ కట్టి తీరాల్సిందేనని ప్రత్యక్ష వేధింపులకు దిగారు. అంతటితో ఆగకుండా విద్యుత్ కనెక్షన్‌ను తొలగించడం, తాగునీటి సరఫరాను నిలిపివేశారు. దీంతో పలువురు బాధితులు పోచారం పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. తమకు జీవించే హక్కును కల్పించాలని, వేధింపులకు పాల్పడుతున్న అసోసియేషన్ ఉపాధ్యక్షుడిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై నాగార్జున రెడ్డి తెలిపారు.

సమస్య పరిష్కారానికి కృషి చేస్తా..

ప్లాట్ ఓనర్ల సమస్యలను పరిష్కరించేందుకే అసోసియేషన్ పని చేస్తుందని, అసోసియేషన్ సభ్యులు కొంతమంది తన ప్రమేయం లేకుండానే ప్లాట్ ఓనర్లను ఇబ్బందులు పెడతున్నట్లు తన దృష్టికి వచ్చిందని అసోసియేషన్ అధ్యక్షుడు బి హరిప్రసాద్ రావు తెలిపారు. ప్లాట్ ఓనర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

సీఎం సభకు భారీగా తరలిరావాలి

ఘట్‌కేసర్/ఘట్‌కేసర్ రూరల్/శామీర్‌పేట/మేడ్చల్ కలెక్టరేట్/ కీసర/జవహర్‌నగర్,అక్టోబర్,17: మేడ్చల్ నియోజకవర్గ పరిధి గుండ్లపోచంపల్లి సమీపంలో బుధవారం సాయంత్రం 4గంటలకు నిర్వహించే ప్రజా ఆశీర్వాద సభకు సీఎం కేసీఆర్ వస్తున్నందున భారీ ఎత్తున బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు తరలిరావాలని జవహర్‌నగర్ మేయర్ కావ్య, కీసర మండల బీఆర్ఎస్ అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, నాగారం మున్సిపాలిటీ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి, దమ్మాయిగూడ మున్సిపాలిటీ చైర్‌పర్సన్ వసుపతి ప్రణీత శ్రీకాంత్ గౌడ్,తూంకుంట మున్సిపాలిటీ చైర్మన్ కారంగుల రాజేశ్వర్‌రావు, ఘట్‌కేసర్ మండల బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి పన్నాల కొండల్ రెడ్డి, ఘట్‌కేసర్ చైర్‌పర్సన్ ముల్లి పావనీ జంగయ్య యాదవ్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

బీఆర్ఎస్‌లోకి భారీగా వలసలు

కుత్బుల్లాపూర్/దుండిగల్ అక్టోబర్17: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కొంపల్లి మున్సిపాలిటీ పరిధి 10వ వార్డు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎ.బుచ్చిరెడ్డి, మధుసూదన్, ఇక్బాల్‌లు మంగళవారం ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ సమక్షంలో బీఆర్ఎస్‌లోకి చేరారు.బీఆర్ఎస్‌లో చేరిన ప్రతి ఒక్క కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందని ఎమ్మెల్యే వివేకానంద్ హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ యూత్ అధ్యక్షులు దూదిమెట్ల సోమేశ్‌యాదవ్, మాజీ కౌన్సిలర్ కిషన్‌రావు, పాస్టర్ ప్రభాకర్, మారయ్య, వేణుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

- గాజులరామారం డివిజన్ పరిధిలోని ఎన్‌టీఆర్ నగర్ నుంచి పార్టీ ఉపాధ్యక్షులు, కాలనీ అధ్యక్షులు ఇబ్రహీంఖాన్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నుండి సుమారు 150 మంది కార్యకర్తలు ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారిలో షేక్ నబీ, అంజత్‌ఖాన్, అజిసల్మాన్, ఉపేందర్, సుమీర్, సోహెల్, మోసిన్, ఖాజా, ఇస్మాయిల్, హుస్సేన్‌అలీ, వేణు, రమేశ్, రాజుతో పాటు కార్యకర్తలు పాల్గొన్నారు.
- కాంగ్రెస్ పార్టీ 127 రంగారెడ్డినగర్ డివిజన్ మాజీ అధ్యక్షులు, జీహెచ్ఎంసీ కుత్బుల్లాపూర్ మాజీ మైనార్టీ చైర్మన్ ఖాజామియా తన అనుచరులతో కలిసి ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు.

గాజులరామారం డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ నుంచి బీఆర్ఎస్‌లో చేరుతున్న కార్యకర్తలకు పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

ఆకట్టుకున్న కూచిపూడి, కథక్ నృత్య ప్రదర్శనలు

కొండాపూర్, అక్టోబర్ 17 : మాదాపూర్‌లోని శిల్పారామంలో కొనసాగుతున్న ఆల్ ఇండియా శారీ మేళలో భాగంగా నిర్వహిస్తున్న సాంస్కృతిక ప్రదర్శనలు సందర్శకులను ఎంతగానో అలరిస్తున్నాయి. ప్రదర్శనల్లో భాగంగా మంగళవారం రేణుక ప్రభాకర్ తన శిష్య బృందంతో కలిసి దక్ష యజ్ఞ, అష్టాదశ శక్తి పీఠాలు కూచిపూడ నృత్యరూపకంలో ప్రదర్శించి ఆకట్టుకున్నారు. అనంతరం అర్చన మిశ్ర, సోనాల్ బాసర్కార్ వారి శిష్య బృందాలతో కలిసి గణేశా వందన, గురు వందన, నృత్య సంగీత్, తరణ, దేవి స్తుతి అంశాలను శ్రేయ సుమన్, లక్షిత, దేవంశీ, నటాషా, స్వాతి, పద్మరని, మిరయాలు కథక్ నృత్యరూపకంలో ప్రదర్శించిన తీరు ఆద్యాంతం ఆకట్టుకున్నాయి. బతుకమ్మ ఉత్సవాలలో భాగంగా శిల్పారామం మహిళా సిబ్బంది ప్రత్యేకంగా రంగు రంగుల పూలతో చేసిన బతుకమ్మల ముందు సందర్శకులతో కలిసి బతుకమ్మ ఆటపాటలతో సందడి చేశారు.

నృత్య ప్రదర్శనలిస్తున్న కళాకారులు

రమణీయంగా నాద బ్రహ్మోత్సవం

మాదాపూర్, అక్టోబర్ 17: మాదాపూర్‌లోని అన్నమాచార్య భావనా వాహినిలో నాద బ్రహ్మోత్సవ వేడకలు అత్యంత ఘనంగా జరిగాయి.పద్మశ్రీ, డాక్టర్ శోభరాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నాద బ్రహ్మోత్సవ్ పేరిట అన్నమయ్య సంకీర్తనలను ఆలాపించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కరీంనగర్‌కు చెందిన ప్రముఖ వైద్య నిపుణులు అనీల్ కుఆమర్ మాల్పూర్ విచ్చేసి అన్నమాచార్య భావనా వాహిని నిర్వాహకులతో కలిసి హజరయ్యారు. ఈ నేపథ్యంలో అన్నమయ్యపురం విదవ్యార్థులు శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్రమ్, శ్రీ లక్షీ అష్టోత్తర శతనామ స్తోత్రమ్, శ్రీ లలితా సహస్రనామ స్తోత్రమ్, శ్రీ అన్నమాచార్య అష్టోత్తర శతనామావళి, గురుస్తుతితో ప్రారంభించారు. ఇందులో భాగంగా ప్రముఖ నేపథ్య గాయకుడు కె. రామాచారి వారి శిష్య బందంతో కలిసి

కంటిమి ఇనాళ్ళు, నిత్యులు ముక్తులు, వినవమ్మ యశోద, గోవిందాశ్రిత వంటి అన్నమయ్య సంకీర్తనలను ఆలాపించారు. కాగా ఈ కార్యక్రమానికి తబల నోవా, కీ బోర్డు రాజు వాద్య సహకారాన్ని అందించారు. అనంతరం అన్నమాచార్య భావనా వాహినిలో నిర్వాహకురాలు, పద్మశ్రీ, డాక్టర్ శోభరాజు కళాకారులకు జ్ఞాపికలను అందజేసి సత్కరించారు. అన్నమయ్య సమేత శ్రీ వేంకటేశ్వర స్వామికి హరతిని ఇచ్చి ప్రసాద వితరణ గావించారు.

నేడు విద్యుత్ ఫీడర్ల మరమ్మతు

శేరిలింగంపల్లి, అక్టోబర్ 17: విద్యుత్ మరమత్తుల పనుల కారణంగా బుధవారం గచ్చిబౌలి సబ్‌స్టేషన్ పరిధిలో పలు ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని ఏఈ వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు గచ్చిబౌలి హౌజింగ్ బోర్డు కాలనీ, పాత గచ్చిబౌలి గ్రామం, వీధినంబర్లు 1,2,3,రాడిసన్ హోటల్, క్విట్‌లాండ్ విల్లాస్, హిమగిరి హాస్పిటల్, గచ్చిబౌలి ఫ్లైఓవర్ నిర్మాణ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఆయన పేర్కొన్నారు. వినయోగదారులు ఈ అంతరాయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

ఎన్ఆర్ఐ ఆత్మహత్య

శేరిలింగంపల్లి, ఆక్టోబర్ 17: ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ ఎన్ఆర్ఐ ఆత్మహత్య చేసుకున్న సంఘటన రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ గుంటూరు ప్రాంతానికి చెందిన జక్కిరెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి(43) రాయదుర్గం మైహోంభుజా అపార్టుమెంట్స్ బీ-బ్లాక్ 1401 ప్లాట్‌లో నివాసం ఉంటున్నాడు. 20 సంవత్సరాల క్రితం ఆస్ట్రేలియాకు వెళ్లిన విష్ణువర్ధన్ రెడ్డి నాలుగు నెలల క్రితం నగరానికి తిరిగి వచ్చాడు. భార్య విడాకులు ఇవ్వడంతో మైంహోం భుజాలో ప్లాట్ అద్దెకు తీసుకొని ఒంటరిగా నివాసం ఉంటున్నాడు. కాగా మంగళవారం సాయంత్రం 4 గంటలకు విష్ణువర్ధన్ రెడ్డి ప్లాట్‌కి వచ్చిన ఓ వ్యక్తి మెయిన్ డోర్ తలుపులు తెరచి ఉండడాన్ని గమనించారు. లోపలికి వెళ్లిచూడగా బెడ్‌రూంలో సీలింగ్ ఫ్యాన్‌కు విష్ణువర్ధన్ రెడ్డి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించి అపార్టుమెంట్ సెక్యూరిటీకి సమాచారం అందించాడు. ఈ మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న రాయదుర్గం పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియాకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేపట్టారు. గుంటూరులో ఉంటున్న విష్ణువర్ధన్ రెడ్డి తల్లిదండ్రులకు సమాచారం అందించి ఆత్మహత్యకు గల కారణాలు తెలుసుకుంటున్నారు. ఆస్ట్రేలియాలో ఆయన చేసిన వ్యాపారాల్లో నష్టం రావడంతో ఆర్థికంగా ఇబ్బందులు తాళలేక ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని పోలీసులు బావిస్తున్నారు.